తిరిగి క్రాసు చేయడంలో మూడు ముక్కలే అడిగాడు వెంకయ్య. ఒకటి—'మీరు చూచినప్పుడు టోపీ జూచినారా. అశ్లీల ప్రదేశం జూచినారా' అని. జవాబు 'టోపీయే' రెండు టోపీ నెత్తిమీదనుంచి తీసి వాళ్లో పెట్టుకోవడం రివాజు వుందా లేదా ?' జవాబు 'ఉంది' మూడు. 'ఒడి అన్నది అశ్లీల ప్రదేశమా ? శ్లీలప్రదేశమా ? జవాబు 'ఒడి ! ఒడి !' అని పిర్యాది తన ఒడి ఎగాదిగా జూచుకుంటూ 'శ్లీలప్రదేశమే ! శ్లీలప్రదేశమే ' అన్నాడు.

'ఇక అశ్లీలానికి తావెక్కడ ?' అని మేజిస్ట్రేటుగారు మరి ఉత్తర సాక్ష్యంతో నిమిత్తం లేకుండా చంద్రమండల వాస్తవ్యుని ఆవ్యాజం కొట్టివేసినారు.

ఆనాటినుంచీ వెంకయ్య గొప్ప జాతీయ నాయకుడై పోయాడు ! కావ్యాల్లో దక్షిణ నాయకుడిలాగు మోగేశాడు.

.... .... .... .... ....

## మ టి లే దు

తల్లో పసుపు పచ్చని పెద్ద చేమంతి తురుముకొని, ఒక డొంకెన కర్రతో వఱదలో ఎండు పుల్ల, ఆ చితుకు ఆ చితుకు, ఆ యెమ్మెలాడి పట్టుకొంటూ వొడ్డుకు విసరుతూ వుంది. ఆమె పెట్టుకున్న చేమంతి పూలు గట్టునున్న కోడెకాండ్రు చూస్తూ వున్నారు.

కొంత సేపటికి పాపారావు అనే యువకుడు కనిపించాడు. వాడడిగాడు ఈ పడుచుని : "నీవు ఇక్కడకు ఎలా వచ్చావు!" అని. "గట్టంతా నాదే కదంట్రా యింక ! ఇల్లా గడ్డిమేటా ?

అన్నీ వరదమయమై పోయినాయి. ఇలారంపైకెక్కి, కూర్చుంది గంగమ్మ తల్లి. ఇక నేను గట్టే నడాడుతూ వుండవలసినదే. అయితే ఏదో పని చెయ్యవద్దూ ? అందుకోసం ఈ డొంకేన కర్ర చేతబుచ్చుకున్నాను.'' అంది. యువకుడు "ఆ పువ్వులు ?'' అన్నాడు. "అవి చూచేవాళ్ళ కవి ! నీక్కనబడుతున్నాయిరా?'' అంది ఆమె. "ఆ ! అవీ కనబడుతున్నాయి నీవూ కనబడుతూ వున్నావు'' అన్నాడు వాడు. "రెండూ ఎలా కనబడతాయి ? నేనెదరకుంటాను. అవి వెనక కుంటాయి'' అంది.

ఇలా సరాగంమీద సరాగం ఆడుకొనే సందులో వరదను బడిపోతూ ఏదో పుడకొకటి పొడుగాటి వలమైంది ఆ అమ్మి యొక్క డొంకెన కర్రకు తగిలి, అలా దక్షిణంగా వాలునే తప్పించుకు పోతూవుంది. పోతూవున్న కర్రకు అడ్డంగా దుమికి తానే వెళ్ళి పట్టుకొని, కర్రసమేతంగా ఆ చిన్నవాడు వస్తూ వున్నాడు. చిన్నది చూస్తూ తన డొంకెనతో అలా అన్నది.

ఎలా అన్నదో చెప్పేకన్న చూస్తే మెఱుగు అలా అన్నది ! తన వొళ్లు అంతా జిగాల్‌మన్నట్టు, తన సిగముడి విదుపుకొన్నట్టు అలా అన్నది తన డొంకెనతో !

డొంకెనకు తన పువ్వులే తగిలాయి, అవి జారిపడి పోబోలు ప్రవాహంలో ఆ సమయాన !

మగువ ఊరికే లాక్కోడం ప్రారంభించింది, ఆ పూలు తన చేరికకు వస్తాయని. అవి దూర దూరంగా ఇంకా పోయి నాయి గాని ఆమె దగ్గరకు రాలే !

"పూలు కావాలా ? కర్ర కావాలా !'' అని అడిగాడు ఆ యువకుడు.

ఒకమాటు పూలు చూస్తూను, ఒక మాటు కఱ్ఱ చూస్తూను ఆ యువతి ఏమని జవాబు చెప్పుచున్నది? "అడివిని చెరిపిన చెట్టు, అడివిని పూచిన పువ్వు. అర్ణవమునకు పోయి అవి అంద వుగా నీకు! వచ్చేసెయ్యి! ఇంకో పువ్వు, ఇంకో చెట్టూపించేన్! వచ్చేయి! వచ్చేయి!" ఆలా ఆమె అంటూనే వుంది. వాడు అక్కడ సుడిగుండంలో పడి మరణించాడు. ఆ పిల్ల తల్లో మఱి పువ్వు లేదు. ఆ పిల్ల మఱి డొంకెన పట్టలేదు.

.... .... .... .... ....

## సన్యాసి - పేదగేస్తుడు

ఆ దారిని షికారు పొయ్యేవాళ్ళు చూచే
యుంటారు వాళ్ళనూ ఆ పాకనూ.

ఆ పాక వాళ్ళ హక్కు భుక్తంలోకి ఎలా వచ్చిందో ఆ సంగతి చారిత్రక పరిశోధకులకు విడిచిపెట్టవలసినదే. లేదా! రైల్వేవారుగాని, డి. పి. డబ్ల్యు వారు గాని, మునిసిపాలిటీవారు గాని, దావాచేస్తే ఆ దావాలో వెల్లడికావలసిందే. అంతవఱకు అదివొక చిదంబర రహస్యంగా పరిగణింపవలసివుంటుంది. ఇంత మంది నెందుకు పేర్కొవలసివచ్చింది? అడుగుతారేమో— ఆ పాకకు తూర్పు పక్కనుంచే రైలుపట్టాలమలుపు, పడమటి పక్కనుంచే ఏటిగట్టు కలుపు, మఱి మునిసిపాల్టీ సరిహద్దుల్లో దాని నిలుపు. వీళ్లల్లో ఎవరు తమ దిగాదాన్ని ఉత్తరోత్తరా దావాచేసి రాబట్టుకుంటారో ఊహాతీతం, బహుశా ఎవళ్లూ ఆ పాకజోలికి పోరనుకుంటాను. ఏమా-ఎవరికీ అది అడ్డున్న ట్టుగా తోచదు. కానైతే కోసుగా ఎత్తుగా లేచిన ఇలారపాక.